భోగి మంటలతో నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు

వర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దు

- భోగిమంటతో విద్యార్థుల నిరసన

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 14: వ్యవసాయ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దని, జీవో 55ను వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు మరోమారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం ఏడోరోజు కూడా విద్యార్థుల నిరసన కొనసాగింది. ఉదయం వర్సిటీ ప్రధాన గేటు వద్ద బైఠాయించిన విద్యార్థులు అక్కడి నుంచి బయోడైవర్సిటీకి ర్యాలీగా వెళ్లారు. 'సేవ్ ద యూనివర్సిటీ ల్యాండ్స్', 'సేవ్ ఫార్మర్స్', 'స్టూడెంట్ పవర్.. నేషనల్ పవర్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మనసు మారాలని కోరుతూ భోగి మంటలు వేశారు. వీరికి వర్సిటీ ఉద్యోగులు, శాస్త్రవేత్తలు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల విద్యార్థి సంఘాల నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ, అరవింద్, మధుకర్, సత్యమూర్తి, భానుచందర్, హరిప్రియ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

వియ్ వాంట్ జస్టిస్

- పాత పంటల జాతర ప్రారంభం

సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్ గ్రామంలో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం పాతపంటల జాతరను ప్రారంభించారు. చిరుధాన్యాలు సాగుచేసిన మహిళా రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణిరావు మాట్లాడుతూ.. పాత పంటలతో జీవ వైవిధ్యంతోపాటు ఆహార భద్రత సాధ్యమని అన్నారు. డీడీఎస్ కృషితో 2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి మిల్లెట్ ఇయర్‌గా గుర్తించిందని తెలిపారు. – జహీరాబాద్

అస్త్ర క్షిపణి గురించి వివరిస్తున్న బీడీఎల్ శాస్త్రవేత్తలు

వాయుసేన చేతికి 'అస్త్ర'

- 100 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని ఛేదించే క్షిపణి
- స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన బీడీఎల్

హైదరాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ): వాయుసేన అమ్ములపొదిలో మరో అద్భుత ఆయుధం చేరింది. హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సంస్థ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'అస్త్ర' మిస్సైల్‌ను రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ ఆదివారం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు అప్పగించారు. గగనతలం నుంచి గగనతలంలోకి దూసుకెళ్లే ఈ క్షిపణి 100 కి.మీపైగా దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. దీంతో ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్స్‌ను రూపొందించగలిగే దేశాల సరసన భారత్ నిలిచిందని మంత్రి అజయ్ భట్ హర్షం వ్యక్తం చేశారు. రక్షణ రంగంలో దేశ ఎగుమతులు వృద్ధి చెందేందుకు 'అస్త్ర' లాంటి ఆయుధాలు దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో బీడీఎల్ సీఎండీ ఏ మాధవరావు, డీఆర్‌డీవో డీజీఎం ఎస్‌ఎస్ యూ రాజాబాబు, డైరెక్టర్ ఎన్ శ్రీనివాసులు(ఫైనాన్స్), పీవీ రాజారామ్ (ప్రొడక్షన్), చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఉపేందర్ వెన్నం తదితరులు పాల్గొన్నారు.

కొత్త క్షిపణుల పరిశీలన

హైదరాబాద్‌లోని ఏపీజే అబ్దుల్ కలాం మిస్సైల్ కాంప్లెక్స్‌లో గల రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ)ను కేంద్ర మంత్రి అజయ్ భట్ సందర్శించారు. అక్కడ తయారవుతున్న అగ్ని ప్రైమ్, ఆకాశ్-ఎన్‌జీ, ప్రళయ్ క్షిపణులను క్షుణ్ణంగా పరిశీలించి శాస్త్రవేత్తలను అభినందించారు. ఆర్‌సీఐలో కొత్తగా రూపొందిస్తున్న క్షిపణులు, ఇతర ఆయుధాల గురించి అధికారులు ఆయనకు వివరించారు.

మా వాటా ఇచ్చేయండి

- 'గొర్రెల పంపిణీ' డీడీల వాపస్ కోసం పశుసంవర్ధకశాఖ ఆఫీసుకు గొల్ల, కుర్మల క్యూ
- పథకం అమలుపై ప్రభుత్వం నుంచి రాని స్పష్టత
- అయోమయంలో గొర్రెల పథకం లబ్ధిదారులు

పెద్దపల్లి, జనవరి 14 (నమస్తే తెలంగాణ): గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించి కొత్త ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాకపోవడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. పథకాన్ని రద్దు చేశారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. గతంలో తాము కట్టిన వాటా డబ్బులు తిరిగి చ్చేయాలని గొల్ల, కుర్మ, యాదవులు పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. ఇప్పటికే 20 మంది వినతిపత్రాలు అందజేశారు. ఈ విషయాన్ని పశుసంవర్ధక శాఖ అధికారులు కలెక్టర్‌తోపాటు రాష్ట్ర శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎవరైతే డబ్బులు వాపస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారో వారికి సంక్రాంతి తర్వాత డబ్బులు తిరిగిచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సగం మందికే అందిన గొర్రెలు

కేసీఆర్ ప్రభుత్వం సూచన మేరకు జిల్లాలో 2,974 మంది డీడీలు కట్టారు. మొత్తం 21 జీవాలుండే యూనిట్ విలువ రూ.1.75 లక్షలు ఉండగా.. సబ్సిడీ కింద ఒక్కో లబ్ధిదారు రూ.43,750 వాటా ధనం చెల్లించారు. డీడీలు కట్టిన వారిలో సీనియార్టీ ప్రకారం జాబితాను తయారు చేసిన పశుసంవర్ధక శాఖ అధికారులు.. జీవాల కోసం లబ్ధిదారులను ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు తీసుకెళ్లారు. ప్రాధాన్యతా క్రమంలో గొర్రెలు ఇచ్చేందుకు 2,974 మంది నుంచి వాటా ధనంగా డీడీలు తీసుకున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.43,750 చొప్పున రూ.13 కోట్ల వరకు స్వీకరించారు. 2023 జూన్ 9న దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించగా.. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. దీంతో ఆ సమయానికి 1,267 మందికి మాత్రమే గొర్రెలు పంపిణీ చేశారు. ఇంకా జిల్లాలో 1,707 మందికి యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో గొర్రెల పథకంపై సందిగ్ధత నెలకొన్నది. ఈ పథకంపై కొత్త ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో డీడీలు కట్టి.. గొర్రెలు అందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇబ్బంది పడకుండా చూస్తున్నం

రెండో విడత గొర్రెల పంపిణీకి డీడీలు కట్టిన చాలా మంది.. ఎన్నికల తర్వాత పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి వచ్చి డబ్బులు అడుగుతున్నారు. విషయాన్ని కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. డబ్బులు వాపస్ కావాలని కోరుతున్న వారికి కలెక్టర్ అనుమతితో తిరిగిచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటి వరకు 20 మంది వచ్చి డబ్బులు వాపస్ ఇవ్వాలని కోరారు. వారం దరికీ సంక్రాంతి తర్వాత డబ్బులు తిరిగిస్తాం. ప్రభుత్వం గొర్రెల పంపిణీకి అనుమతిస్తే తిరిగి డీడీలు తీసుకుంటాం.

–రవీందర్‌రెడ్డి, ఏడీ, పశుసంవర్ధక శాఖ, పెద్దపల్లి జిల్లా

అందరికీ గొర్రెలను పంపిణీ చేయాలి

ఇప్పటికే జిల్లాలో మొదటి, రెండో విడతల్లో గొర్రెలను పంపిణీ చేశారు. నేను డీడీ తీసినా నాకు గొర్రెలు ఇవ్వలేదు. డీడీలు కట్టినా గొర్రెలు అందని వారందరికీ పంపిణీ చేయాలి. లేదా లబ్ధిదారుకు ఆ యూనిట్ కాస్టును చెల్లించాలి.

–బక్కతట్ల దేవేందర్, లబ్ధిదారుడు, మచ్చుపేట, ముత్తారం మండలం, పెద్దపల్లి జిల్లా

యాదవులందరికీ న్యాయం చేయాలి

జిల్లాలో యాదవులందరికీ సమాన న్యాయం జరగాలి. ఇప్పటి వరకు కొంత మందికి మాత్రమే గొర్రెలు పంపిణీ చేశారు. మేమూ డీడీలు కట్టాం. మాకు కూడా గొర్రెలను పంపిణీ చేయాలి. లేదంటే డబ్బులు వాపస్ చేయాలి. –కూరాకుల ఓదేలు, లబ్ధిదారుడు, శుక్రవారంపల్లి, ముత్తారం మండలం, పెద్దపల్లి జిల్లా

పులియబెడితే పుష్కలంగా పోషకాలు!

- ఆహారం ఎంత పులిస్తే అంత మంచిది
- మిల్లెట్లపై అధ్యయనంలో వెల్లడి
- వివరాలు వెల్లడించిన ఎన్‌ఐఎన్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ): పులియబెట్టిన ఆహారంలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని మరోమారు స్పష్టమైంది. రాగులు, సజ్జలు, జొన్నలతో చేసిన ఆహార పదార్థాలపై జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్) జరిపిన తాజా పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. ఆహారానికి పెరుగు కలిపి, కలపకుండా రెండు వేర్వేరు అధ్యయనాలు చేయగా పోషకాల్లో వచ్చిన మార్పులను అధ్యనకారులు గుర్తించారు. నిజానికి మన పూర్వీకులు పులియబెట్టిన ఆహారపదార్థాలనే తరచూ తీసుకునేవారు. అందులో చద్దన్నం ఒకటి. రాత్రి మిగిలిన అన్నంలో పెరుగు, పాలు, సరిపడా నీళ్లు పోసి ఉదయం దానిని అల్పాహారంగా తీసుకునేవారు. అలా తీసుకున్న వారికి ప్రొబయోటిక్స్‌తోపాటు శరీరానికి సరిపడా క్యాల్షియం, ఐరన్, జింక్ వంటి పోషకాలు అందేవి. జీవనశైలితోపాటు క్రమంగా ఈ అలవాట్లు కూడా మారిపోయాయి. చద్దన్నం స్థానంలో టిఫిన్లు వచ్చి చేరాయి. ప్రస్తుతం మిల్లెట్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో మిల్లెట్లతో చేసిన ఆహారాన్ని పులియబెట్టడం వలన కలిగే రసాయనిక మార్పులను పరిశీలించి ఈ విషయాన్ని వెల్లడించారు.

పెరిగిన మైక్రో న్యూట్రిషన్ల పరిమాణం

సజ్జలు, రాగులు, జొన్నపిండితో చేసిన ఆహారాన్ని శాస్త్రవేత్తలు పలు రకాలుగా పరిశీలించారు. వండిన, పెరుగుతో పులియబెట్టిన, పెరుగు లేకుండా పులియబెట్టిన, ఎక్కువ పెరుగు కలిపి పులియబెట్టిన ఆహార పదార్థాల్లోని పోషకాల మార్పులను పరిశీలించారు. వండిన ఆహారం కంటే పులియబెట్టిన ఆహారంలో ప్రొటీన్లతోపాటు మైక్రోన్యూట్రిషన్ల పరిమాణం పెరిగినట్లు గుర్తించారు. రాత్రంతా నిల్వ ఉంచిన ఆహారంలో ఐరన్, జింక్, సూక్ష్మ పోషకాలు కూడా గణనీయంగా పెరిగాయని, సులభంగా కరిగిపోయే పోషకాలు సాధారణంగా వండిన పదార్థాల కంటే పులిసిన దాంట్లోనే ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. తృణధాన్యాలను సంప్రదాయక పద్ధతుల్లో వండుకోవడం మంచిదని, దీనివల్ల పోషకాలు పెరుగుతాయని శాస్త్రవేత్తలు వివరించారు.

ప్రైవేటు బస్సులో భారీ చోరీ

- బ్యాగులోని 11.80 లక్షల చోరీ
- సీసీ కెమెరాలో రికార్డయిన నిందితుల దృశ్యాలు

సీసీ కెమెరాకు చిక్కిన నిందితుడి చిత్రం

నిజామాబాద్ క్రైం, జనవరి 14: ప్రైవేటు బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి బ్యాగులో నుంచి రూ.11.80 లక్షలను దుండగులు అపహరించిన ఘటన నిజామాబాద్ జిల్లాలో ఆదివారం చోటుచేసుకున్నది. జగిత్యాల జిల్లాకు చెందిన హన్మంతు ముంబైలో ఓ తాడి(కల్లు) బట్టీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆ బట్టీ యజమాని కూడా జగిత్యాలకు చెందినవాడే. హన్మంతు సంక్రాంతి పండుగ కోసం ముంబై నుంచి జగిత్యాలకు వస్తుండగా.. బట్టీ యజమాని రూ.11.80 లక్షలను హన్మంతుకు ఇచ్చి తన ఇంట్లో ఇవ్వాలని చెప్పాడు. హన్మంతు ఆ డబ్బులను తీసుకొని శనివారం మధ్యాహ్నం ముంబైలో ఓ ప్రైవేటు బస్సులో ఎక్కాడు. ఆదివారం ఉదయం 6.30 గంటల సమయంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అర్సపల్లి వద్ద ఉన్న భవానీ హోటల్‌లో టీ తాగేందుకు డ్రైవర్ బస్సును నిలిపాడు. అదే సమయంలో హన్మంతు డబ్బులతో ఉన్న బ్యాగును సీటుపై పెట్టి కిందకు దిగాడు. సుమారు అరగంట పాటు బస్సు నిలపడంతో ఇదే అదునుగా భావించిన దుండగులు సీటులో ఉన్న బ్యాగుతో ఉడాయించారు. బస్సు కదిలే సమయంలో హన్మంతు వచ్చి చూడగా తన సీటుపై ఉంచిన డబ్బుల బ్యాగు కనిపించలేదు. చోరీకి గురైందని గ్రహించి వెంటనే బస్సు డ్రైవర్‌కు చెప్పడంతో ఆరో టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సౌత్ రూరల్ సీఐ వెంకట నారాయణ, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. డబ్బులు ఉన్న బ్యాగును మాస్క్ ధరించి వచ్చిన దుండగుడు తీస్తున్నట్టుగా బస్సులోని సీసీ కెమెరాలో రికార్డయ్యింది. నిందితుడి వెంట వచ్చిన మరో ఇద్దరు కూడా బస్సు డోర్ వద్ద నిలబడి ఉండటం సీసీ కెమెరాలో రికార్డయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. చోరీ జరిగిన ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

చైనా మాంజాకు జవాను బలి

- బైక్ వస్తుండగా మాంజా తగిలి జవాన్ మృతి
- పతంగి కోసం వెళ్లి భవనంపై నుంచి కాలుజారిపడి ఏఎస్సై కుమారుడు..
- సంక్రాంతి పండుగ వేళ
- రెండు కుటుంబాల్లో విషాదం

కోటేశ్వర్‌రెడ్డి

ఆకాశ్

మెహిదీపట్నం/కుత్బుల్లాపూర్ జనవరి 14: సంక్రాంతి పండుగ వేళ రెండు కుటుంబాల్లో విషాదం అలుముకున్నది. వ్యాపారులు అమ్మెద్దని, ప్రజలు వాడొద్దని నిషేధించిన చైనా మాంజా తగిలి ఆర్మీ జవాన్ ప్రాణాలు కోల్పోయాడు. పతంగి ఎగరేస్తూ ఏఎస్సై కుమారుడు భవనంపై నుంచి పడి చనిపోయాడు. ఏపీలోని విశాఖకు చెందిన కోటేశ్వర్ రెడ్డి (29) ఆర్మీలో పనిచేస్తూ 20 రోజుల క్రితం బదిలీపై హైదరాబాద్‌కు వచ్చాడు. అత్తాపూర్ సమీపంలోని నలందనగర్‌లో తన భార్య, రెండేండ్ల కూతురుతో కలిసి నివాసముంటూ లంగర్‌హౌస్‌లోని గోల్కొండ మిలటరీ దవాఖానలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం సాయంత్రం లంగర్‌హౌస్ ఫ్లై ఓవర్‌పై తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, అకస్మాత్తుగా గొంతుకు చైనా మాంజా తగిలి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం ఆయనను ఉస్మానియా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచాడు. లంగర్‌హౌస్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిక్కుకున్న పతంగికి తీసేందుకు వెళ్లి..

అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న రాజశేఖర్ చిన్న కుమారుడు ఆకాశ్ (20) అల్వాల్‌లోని లయోల కళాశాలలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. కొంపల్లిలోని ఎన్‌సీఎల్ కాలనీలో గ్యాస్ గెడ్ గ్రీన్స్ అపార్ట్‌మెంట్‌లో ఐదో అంతస్థు భవనంపై నుంచి ఆదివారం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్‌వాసులతో కలిసి పతంగి ఎగురవేస్తున్నాడు. ఈ క్రమంలో పతంగి కింద చిక్కుకున్నది. ఆ పతంగిని బయటకు తీసేందుకు భవనంపై నుంచి కిందకు దిగేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించగా అప్పటికే ఆకాశ్ చనిపోయినట్టు వైద్యులు వెల్లడించారు.

- బైక్‌పై అయోధ్యకు దివ్యాంగుడి యాత్ర

అయోధ్యలో ఈ నెల 22న రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని మక్తల్ ప్రాంతవాసులు బైక్‌పై బయలుదేరారు. నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన దివ్యాంగుడు నారాయణ.. చంద్రశేఖర్ అనే వ్యక్తితో కలిసి ఆదివారం పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి బైక్‌పై అయోధ్యకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారిని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ సభ్యులు సన్మానించారు. – మక్తల్ అర్బన్

ఢిల్లీలో విమాన ప్రయాణికుల ఉక్కిరి బిక్కిరి

న్యూఢిల్లీ : ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశయంలో ప్రయాణికులు ఆదివారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బారులు తీరిన విమానాల్లో గంటల తరబడి ఉక్కిరిబిక్కిరయ్యారు. దట్టమైన పొగమంచు, దారి కనిపించని ప్రతికూల వాతావరణం వల్ల విమానాలు బయల్దేరడం ఆలస్యమవడంతో గత్యంతరం లేని స్థితిలో పడిపోయారు. దేశ రాజధాని నగరం ఢిల్లీలో గాలి నాణ్యత తక్కువగా ఉండటంతో అత్యవసరం కాని భవన నిర్మాణ పనులు, బీఎస్-3 పెట్రోలు, బీఎస్-4 డీజిల్ నాలుగు చక్రాల వాహనాల రాకపోకలను ఆదివారం నిషేధించారు. దేశ రక్షణ, రైల్వేలు, మెట్రో రైల్, హైవేలు, రోడ్లు, విద్యుత్తు సరఫరా వంటివాటిని ఈ నిషేధం నుంచి మినహాయించారు. ఈ నగరంలో గాలి కాలుష్యాన్ని తగ్గించే వ్యూహాలను అమలు చేసే కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ఈ మేరకు ఆదేశాలిచ్చింది.ప్రతికూల వాతావరణంతోపాటు స్థానిక కాలుష్యం వల్ల ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) పెరిగింది.

సన్యాసిగా మారనున్న సాఫ్ట్‌వేర్ యువతి

- 22న మధ్యప్రదేశ్‌లోని జావుదాలో దీక్ష స్వీకరణ
- ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలో శోభాయాత్ర

ఆదిలాబాద్ పట్టణంలో శోభాయాత్రగా వెళ్తున్న ట్వింకల్ కామ్‌దార్

ఎదులాపురం, జనవరి 14: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ యువతి ఆధ్యాత్మిక బాటలో నడిచి సన్యాసిగా మారాలని నిర్ణయం తీసుకున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని కుమార్‌పేట్‌కు చెందిన ట్వింకల్ కామ్‌దార్ జైనమత సన్యాసం స్వీకరించనున్నారు. ఆమె స్థానికంగా ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేసి, అక్కడే ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 29 ఏండ్ల ట్వింకల్ కామ్‌దార్ 2007 నుంచి జైన మతగురువు రామ్‌లాల్ జీ బోధనలు వింటున్నది. అందుకు ఆకర్షితులై సన్యాసిగా మారాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సంప్రదాయబద్ధంగా చందన మండల పూజాక్రతువును ప్రారంభించారు. ఆదివారం ఉదయం ఆదిలాబాద్ పట్టణ ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు, జైనమతస్థులు హాజరు కాగా.. భక్తిగీతాలతో ప్రధాన వీధులు మార్మోగాయి. ఈ నెల 22న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జావుదాలో దీక్షా మహోత్సవం సందర్భంగా జైన మత సన్యాసాన్ని స్వీకరించనున్నట్టు ట్వింకల్ కామ్‌దార్ తెలిపారు. ఆమె తల్లి శ్వేత కామ్‌దార్, తండ్రి గిరీశ్ భాయ్ కామ్‌దార్ కొన్నేండ్ల క్రితం చనిపోయారు.

ఒక్కరోజే 53 లక్షల మంది ప్రయాణం

- రికార్డు స్థాయిలో ఆర్టీసీకి సంక్రాంతి ఆక్యుపెన్సీ
- 6,261 ప్రత్యేక బస్సులతో ప్రణాళిక
- జిల్లాలకు తరలిన హైదరాబాద్ సిటీ బస్సులు

హైదరాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ): పండుగ వేళ ప్రజలు ఆర్టీసీకి బ్రహ్మరథం పడుతున్నారు. సొంత వాహనాల కన్నా ఆర్టీసీ ప్రయాణానికే మొగ్గు చూపుతుండటంతో రికార్డు స్థాయి ఆక్యుపెన్సీ నమోదవుతున్నది. శనివారం ఒక్కరోజే 52.78 లక్షల మందిని ఆర్టీసీ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చింది. ఇందులో సగానికిపైగా మహిళలే. వీరంతా మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకుని ఉచితంగా సొంతూళ్లకు వెళ్లినట్టు టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా 4,484 ప్రత్యేక బస్సులను నడుపాలని ఆర్టీసీ ప్రణాళికలు రచించింది. అంచనాలకు మించి ప్రయాణికుల రద్దీ ఉండటంతో ఈ నెల 11, 12, 13 తేదీల్లోనే 4,400 ప్రత్యేక బస్సులను నడిపినట్టు వెల్లడించారు. శనివారం వరకు మొత్తం 6,261 ప్రత్యేక బస్సులను నడిపినట్టు చెప్పారు. అంచనా కన్నా 1,777 బస్సులను అధికంగా నడిపినట్టు వివరించారు. రికార్డుస్థాయిలో శనివారం ఒక్కరోజే 1,861 ప్రత్యేక బస్సులను వివిధ ప్రాంతాలకు నడిపినట్టు తెలిపారు. హైదరాబాద్ సిటీలో నడిచే 1,127 బస్సులను ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న కరీంనగర్, వరంగల్, విజయవాడ, ఖమ్మం, తదితర రూట్లలో తిప్పినట్టు చెప్పారు. ఆదివారం కూడా 652 ప్రత్యేక బస్సులు నడిపామని పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళికతోపాటు సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల సంక్రాంతికి ఎలాంటి ఘటనలు జరగకుండా ప్రశాంతంగా సొంతూళ్లకు చేర్చామని తెలిపారు. తొలిసారిగా బస్‌భవన్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను ప్రయాణికులకు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. సంక్రాంతికి ప్రశాంతంగా ప్రజలను సొంతూళ్లకు చేర్చడంలో పాలుపంచుకున్న టీఎస్ఆర్టీసీ సిబ్బంది, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

కశ్మీర్‌లో మళ్లీ చలి పులి

న్యూఢిల్లీ : కశ్మీరులో చలి పులి పంజా మళ్లీ విసురుతున్నది. శనివారం కాస్త ఉపశమనం ఇచ్చినా, ఆదివారం శ్రీనగర్‌లో మైనస్ 4.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాది శ్రీనగర్‌లో పగటి పూట సాధారణం కన్నా ఎనిమిది డిగ్రీల సెల్సియస్ ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే రాత్రి వేళల్లో చలి విపరీతంగా ఉంటున్నది. మరోవైపు జమ్మూలో ఓ వారం నుంచి శ్రీనగర్ కన్నా చలి తీవ్రత ఎక్కువగా ఉంది. శనివారం రాత్రి ఇక్కడ 2.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అమర్‌నాథ్ యాత్ర బేస్ క్యాంప్ ఉన్న అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్‌గామ్‌లో మైనస్ 5.5 డిగ్రీల సెల్సియస్ నమోదైంది.

బెంగళూరులో విమానాల రాకపోకలకు అంతరాయం

బెంగళూరు : నగరంలోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు ఆదివారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. దట్టమైన పొగమంచు కురియడం వల్ల ఢిల్లీ వెళ్లవలసిన 7 విమానాలు సహా 44 విమానాలు బయల్దేరడం ఆలస్యమైందని, కొన్ని విమానాలు దిగడంలో జాప్యం జరిగిందని అధికారులు తెలిపారు. బెంగళూరు సహా అనేక నగరాల్లో ప్రతికూల వాతావరణం ఉందని అధికారులు తెలిపారు.

కేజీబీవీల్లో 53% ఎస్సీ, ఎస్టీలే

- దేశంలో అత్యధిక నమోదు వారిదే
- తెలంగాణలో 495 విద్యాలయాలు
- 52శాతం చేరిన బీసీ విద్యార్థులు
- ఇంగ్లిష్ మీడియం బోధనతో విజయపథంలో కేజీబీవీలు

హైదరాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ) : కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) 53 శాతం ఎస్సీ, ఎసీ వర్గాలకు చెందిన అమ్మాయిలే చదువుకొంటున్నారు. దేశవ్యాప్తంగా సామాజికవర్గాల వారీగా వివరాలను పరిశీలిస్తే... వీరిలో 27% ఎస్సీ బాలికలుండగా, ఎస్టీలు 26% విద్యనభ్యసిస్తున్నారు. ఇక ఓబీసీలు 35శాతం కాగా, ముస్లింలు 3 శాతం మాత్రమే కేజీబీవీల్లో చదువుకొంటున్నారు. వెనుకబడిన ప్రాంతాల్లో నాణ్యమైన విద్య అందించేందుకు జాతీయంగా కేజీబీవీలను నిర్వహిస్తున్నారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు పూర్తిగా రెసిడెన్షియల్ పద్ధతిలో నడుపుతున్నారు. జాతీయంగా 8,06,528 మంది విద్యార్థినులకు విద్యనందించడం లక్ష్యంగా కేంద్రం 5,646 కేజీబీవీలను మంజూరు చేసింది. ప్రస్తుతం 4,988 కేజీబీవీలు నడుస్తున్నాయి. 6,69,070 మంది విద్యార్థినులు చదువుకొంటున్నారు.

కేజీబీవీల్లో నమోదు వివరాలిలా..

సామాజికవర్గం	విద్యార్థులు	శాతం
ఎస్సీ	1,82,841	27.32
ఎస్టీలు	1,75,366	26.21
బీపీఎల్	46,115	06.89
ఓబీసీ	2,38,708	35.68
ముస్లింలు	26,040	3.89

తెలంగాణలో 52శాతం బీసీలు

తెలంగాణలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉన్నది. రాష్ట్రంలో 52 శాతం ఓబీసీ వర్గాలకు చెందిన అమ్మాయిలు కేజీబీవీల్లో చదువుకొంటున్నారు. 44శాతం ఎస్సీ, ఎస్టీల అమ్మాయిలున్నారు. మైనార్టీలు అతి తక్కువగా 0.57 మాత్రమే కేజీబీవీల్లో నమోదయ్యారు. రాష్ట్రంలో 204 మైనార్టీ గురుకులాలుండగా, వీటిల్లో ప్రత్యేకించి 97 గురుకులాలు అమ్మాయిల కోసమే నిర్వహిస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొన్నది. రాష్ట్రంలో మొత్తం 495 కేజీబీవీలున్నాయి. వీటిల్లో 1,40,470 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. తెలంగాణలోని నమోదును జాతీయంగా పోల్చితే దాదాపు 20 శాతం మనదగ్గరే ఉండటం విశేషం. రాష్ట్రంలో 2022 -23లో 1,33